అనుక్షణం మారుతూ

పెరుగుతూన్న, ప్రపంచంలో

# ఒక అమాయకుడి గాథ

ఆర్. యం. పట్టాభి

రావిచెట్టు ఆకుల సందుగుండా నీలాకాశం వేయితునకలగా కనిపించింది - ఎంతో దూరంలో. ఆ పచ్చని ఆకుల్లో నీడల్ని చూస్తుంటే వెంకన్నకు ప్రపంచం అంటే తెలుసుకోవాలనే ధ్యాస ఎక్కువయిందనాలి! లోకంలో అర్థంకానివి ఉన్నయ్. "ప్రపంచం ఎంతమాయ" అన్న మాటలో సర్వం విదితం అయినట్టు ఫీలవటం వెంకన్నకు మామూలే! వేదాంతం కాదు-మరే పాడుకాదు? ఎన్నో సంగతులు వింటూంటే తనజన్మ ఎంత తృణమైంది అనిపించదు పాపం!

పాతచుట్టను విసిరేసి, ఆఖరి చూపుల్ని పోనిచ్చి, చుట్టనుంచి వచ్చే నిప్పురవ్వల్ని మందంగా లేచే పొగల్ని, పరీక్ష చూపుల్తోనే పరికిస్తూండిపోయాడు. ఈభూమి ఏమిటి? ఈ ఆకాశం, ఈ వర్షాలు, ఈ ఎండలు వానలు, ఈ చీకటి వెలుతురులాటి ప్రశ్నలు లెక్క వేయలేనంతగా మనస్సులో దొర్లినయ్. సమాధానం చెప్పలేని తన పాడుజన్మ. ఒక్కసారి పల్నాటి చేంతాడంత నిట్టూర్పు విడుస్తూ, అమాయకత్వానికి, అజ్ఞానానికి నిరసనలాటి చూపుతో అటుఇటు కళ్ళు తిరిగినయ్. ఈ ప్రపంచంలో ఒక రావిచెట్టుక్రింద, రచ్చబండమీా చుట్టూ జనంలో వచ్చి ఉన్నానని వెంకన్నకు ఇప్పుడే గుర్తుకు రావటం జరిగిందని చెప్పటం తప్పదు! వెంకన్న బెదిరిపోయాడు, ఇంతసేపు వినకుండా పాడు ఆలోచనలలో కాలం గడిపానని. కళ్లకు రాంబాబు కనిపించాడు. రాంబాబు దేవుడిలా అగుపించటం ఎవరు నమ్మరు? రాంబాబు చెప్పే కబురులు, ఈ రాంబాబే ఈ విమానాల్ని, రేడియోల్ని, రైళ్ళని, కార్లని చేశాడా అనే ధర్మసందేహాన్ని మరీ బలపరుస్తాయన్నది సత్యం.

రాంబాబు గోల్డుఫ్లేక్ సిగరెట్ విదుల్చుతూ దూరంగా మూలన కూర్చున్న వెంకన్నమీాద చురుకైన చూపు ఓక్షణంపాటు విసిరి,

"ఇదుగో చూడండి ఒక ప్రశ్న అడుగుతున్నాను చెప్పాలి"

ఎవరిని అడుగుదామా అన్నట్టు చుట్టూ వెదికాడు కళ్ళుజోడుకుండా నిముషంపాటు.

"ఈ రోజున జనాభా ఎందుకు పెరిగిందంటారు?" అని ప్రక్కన రైతును అడిగాడు. తలగుడ్డ ఊడదీస్తూ పెద్దగా నవ్వాడు. వంకరలు తిరిగిన మీాసాలపైకి బండపారిన చేతులు పోయినయి. ముఖంలో వేయిముడతలు ఈ జీవితంలో ఇంతనవ్వు రాలేదన్నట్టు చెప్పటం జరిగింది. బలవంతంగా నవ్వును ఆపుకొని,

"జనం గినం పెరగలేదు. జనాభా లెక్కలు తప్పు, పూర్వమే జనం ఎక్కువ" అన్నాడు. తత్తిపలుకుతూ నిస్సందేహంగా. వెంకన్నలో ఆతురత ఎక్కువయింది.

రాంబాబు దెబ్బతిన్న జింకలా కనిపించాడు. ఈ గండంనుంచి రాంబాబు ఎలా బయటపడటం ? ఇంతవరకు నిరాఘటంగా ఎవరిని కుక్కురు మననీయకుండా అనర్గళంగా ఏకధాటిగా ప్రపంచాన్నిగురించి, పెరిగిన శాస్త్రీయజ్ఞానం, రేడియాలూ, రైళ్లు, విద్యుచ్ఛక్తి, టెలివిజన్, సినిమాలు ఇవన్నీ చెప్పుతుంటే ఎవరు ఏం అడ్డు చెప్పలేకపోవటం వెంకన్నకు తెలుసు.

రాంబాబు - సిగరెట్ పొగల్ని విడుస్తూ క్షణంపాటు ఆలోచించి,

"రామయ్య తాతా, నీవు పెద్దవాడివి. నీ చిన్నతనంలో ఈ ఊరు ఎంత ఉండేది. ఎన్ని ఇళ్ళు ఉండేవి? ఈ ఊరుచుట్టు ఎన్ని ఇళ్లు కట్టారు? ఇవి నీకు తెలియవా?"

రామయ్యతాత బోసినోరు మళ్ళీ తెరుచుకుంది మరో పెద్ద నవ్వుతో.

"ఒర్లే మనమడా! బాగా నచ్చచెప్పావురా! ఇంగిలీషు చదువుకున్నాడివి గదూ?"

వెంకన్నకు ఒకటే విషయం గట్టిగా మనస్సులో పాతుకుపోయింది. రాంబాబు ఇంత తెలివిగా మాట్లాడటం చదువుకోవటం వల్లనే అని!

"ఒరేయి విను. మన పెద్దలు ఏం చెప్పారో ఒకసారి ఆలోచించు. జనం పెరిగింది అని కబురులు దంచితే కాదు. 'పెరగటం విరగటం కోసం' అన్న సామెత ఊరికనే వచ్చిందా? జనం పెరిగింది అంటే, మన రైళ్లు, కారులు, డాక్టరులు, మందులు, తుపాకులా కారణం చూడు. చూడవోయి ఎప్పుడో ఈ ప్రపంచం టుక్కుమంటుంది. పరబ్రహ్మగారు ఊరికే చెప్పారా? ఈసంబడం అంతా ఆ నిముసం వచ్చేవరకే!"

రామయ్యతాత పోటికర్ర మీద గడ్డం ఆన్చి, ఈచుట్టూ జనంకేసి చూపుల్ని పోనిస్తూ, గట్టిగా రాంబాబుకు ఊకపోత పోశాడు.

వెంకన్న మళ్లా రాంబాబుకేసి చూచాడు. చూపులు గోల్డ్ ఫ్లేక్ సిగరెట్ పొగల్లోకి దూసుకుపోయినయ్. రెపరెపలాడే లాల్చీ చివరలు వెంకన్న కళ్లకు ఆదోలా కనిపించినయ్.

"రామయ్యతాతా ఒక ప్రశ్న అడుగుతాను" అని అనకముందే-

పన్నుకర్రను నేలకేసి కొట్టుతూ-

"ఈ రేడియోలు మనకున్నయ్. విమానాలు మాత్రం లేవా? పుష్పక విమానం ఎక్కడిది?"

రాంబాబు గుక్క తిప్పుకోలేదని వెంకన్నకు తెలుసు. సిగరెట్ పొగలు వదులుతూ,

"మన పూర్వులకి విమానాలే ఉన్నయ్ అనుకుందాం? రేడియోలు వాడుకున్నారని ఒప్పుకుందాం? బ్రహ్మాండమయిన మరలు ఉన్నయని కాసేపు అనుకుందాం. అవి ఉన్నయో లేవో మనకు తెలియదు. నిన్నటివరకు మనం చూడలేదు. చెడిపోయి ఏమూలనన్నా పడిఉన్నయ్ అంటే అదీ లేదు. రామరాజ్యంలో రేడియో స్టేషన్‌లు ఉన్నయ్ అందాం. కారులు, సైకిళ్లు, బస్‌లు అన్నీ ఉన్నయ్. ఈ రోజుల్లోలాగా రేడియోలు ఉన్నట్టు మన రామాయణంలో భారతంలో వ్రాయలేదే! అంత నాగరికత ఎక్కువగాఉంటే, పుస్తకాలన్నీ తాటాకుల్లో ఉండిపోయినయే! ఈ రోజుల్లోలాగా ప్రింటింగ్ ప్రెస్ వందలకొలది పుస్తకాలను కాగితాల్లో ప్రచురించలేదే?"

రామయ్యతాత ఓడిపోయినట్టు చూశాడు అందరివంక. మళ్లా ఓ గుక్క సిగరెట్ పొగ వదుల్తూ,

"రామాయణం కాలంలో ఈరోజునకంటే ఎక్కువ నాగరికత విజ్ఞానం ఉందనుకుందాం! అయితే పుష్పకవిమాన సర్వీస్ ఉన్నప్పుడేనా రాముడు చేసిన తప్పు?"

రామయ్యతాత ఆవలించి "ఏమోయ్, చదువుకున్న చదువులు ఊరికే పోలేదన్నమాట. సాక్షాత్తు భగవంతుడయిన రాముణ్ణే విమర్శిస్తున్నాడు?"

చిన్ననవ్వుతో "విమర్శించటం కాదు. ఈ విషయం వినాలి. ఎక్కువ వేడి- తక్కువ వేడి ప్రదేశానికి రెండు సమానం అయేవరకు ప్రపహిస్తుంది అనే విషయం మాకు ఫిజిక్స్‌లో అంటే భౌతికశాస్త్రంలో చెప్పుతారు. రాముడు సీతనునిప్పులో దూకమన్నాడు పాతివ్రత్యాన్ని పరీక్షించటానికని. ఈ రోజున ఎవతయినా నిప్పు అంటుకుంటే కాలుతుంది. వీళ్లంతా పతివ్రతలు కారా?"

రామయ్యతాత పెద్దగా నవ్వాడు.

"ఒరేయ్ మనమడా నీ వెక్కడతేరా" అన్నాడు, మీసం దువ్వుతూ ఓడిపోయినా గెలిచానన్నట్టు.

"అందుకనే మనం నమ్మం. ఆ రోజున న్యాయం అలా చచ్చింది. ఈరోజున పెళ్ళాల మీద అనుమానం గలిగినవాళ్లంతా నిప్పులో ఎందుకు దూకమనరు? అలాదూకితె ఎవతె బయటికి వస్తుంది?"

వెంకన్నకు వగరు వెలక్కాయ నోట్లో ఇరుక్కున్నట్టయింది. రాముడికి సీతమీద అనుమానం కలిగి నిప్పులో దూకమన్నాడు. ఈ రోజున మనం మన పెళ్లాల్ని పాతివ్రత్యం ఋజువుపరచటానికి నిప్పులో ఎందుకు దూకమనం? రాంబాబు తెలివికి వెంకన్నకు ఒళ్లు

తెలియలేదంటే ఎవరు నమ్మరు? రాంబాబుకు ఇంత వాదనశక్తి ఎక్కడినుంచి వచ్చింది? దీనికి కారణం? వెంకన్నకు అర్థం కాలేదు. అర్థం కాదు. కళ్ళు తెలియని మరుపులో మళ్ళినయ్. అటూ ఇటూ కదులుతున్న రావి ఆకులుచుట్టు మిద్దెలనుంచి వస్తున్న పొగలు, దూరంగా కొండ మిట్టలమీద నాటిన నల్లటి ఆకాశం రంగులు మెరిసినయ్ చూపుల్లో.

రాంబాబు సిగరెట్ పారేస్తూ "అందుకే రాముడికి మనకంటె తెలివి తక్కువ" అంటాను. అన్నాడు పొగను విడుస్తూ, లాల్చీ చేతుల్ని పైకి తీసుకుని, చూపులను చుట్టూ జనంపైకి పోనిచ్చి. వెంకన్న మనస్సులో రాలిపోయి గాలికి కొట్టుకుపోతున్న రావి ఆకులు మెదిలినట్టు అనిపించింది.

రామయ్యతాత,

"ఏమో లేవోయ్. ఈ రోజున మనుష్యులేం పగలతీశారో చూస్తున్నాంగా." అన్నాడు నవ్వుతూ, ఒక నిముషంవరకు మీసాలను దువ్వుతూ.

"మనుష్యులు ఏంచేయలేదు! మనుష్యులు చాలా చేశారు. మనిషి ప్రకృతికి రాజయిపోయాడు. పెద్దపెద్ద అడవుల్ని నరికి సేద్యం చేస్తూన్నాడు. ట్రాక్టరులతో భూమిని దున్నుతున్నాడు. పక్షిలా ఆకాశంలో విమానాల్లో పిల్లిగింతలు కొట్టుతున్నాడు. చేపల్లా నీళ్ళల్లో బుడగలు కొట్టుతున్నాడు. నేలమీద నిర్భయంగా తిరుగుతున్నాడు."

రామయ్య తాతకు నచ్చలేదు. దేనికో. ఆయన మనస్తత్వం అలాంటిదేమో! పూర్వులు తమకంటే అధములని ఒప్పుకోవటం జన్మజన్మాకిల ఇష్టపడని గిట్టని విషయమేమో!

"మనవాళ్లు కాశీకిపోయినా కాటికి పోయినా రారు, అన్నారు. అలా అనటానికి కారణం ఏమిటి?"

రాంబాబు ఛాలెంజి చూపులు అందరి ముఖాల్లోకి పోయినయ్. రామయ్య తాత దగ్గాడు. ఒక చేయి మీసంమీదకు పోయింది. మరో చేయి పన్ను కర్రను నేలమీదకు జాడించింది. చూపులు ఒకసారి రాజరీవిలో 'ఓడిపోయినా అలక్ష్యం' అన్నటు తిరిగినయ్.

రావి కొమ్మలు గాలి విసురుల్లో సాయంకాలం నీడలో తళతళలాడుతూ వంగి వయ్యారంగా ఊగినయ్, ముందుకి వెనక్కి.

వెంకన్న రాంబాబు వాదన బలంగా కనిపించింది. ఈ రోజున ఇంతమంది కాశీకి పోతున్నారు. సుఖంగా తిరిగివస్తున్నారు. పుష్పక విమానాలు ఆ రథాలు, గాలిలో ఎగరటాలు ఉండివుంటే 'కాశీకిపోయినా కాటికిపోయినా తిరిగిరారు' అనే వాడుక ఎందుకు ఉండాలి?

రాంబాబు కళ్ళజోడు తీసి పక్క జేబులో చేతిరుమాలు లాగి తుడుస్తూ "ఈ రోజున యంత్రాలు! అవే మనకు ఉపయోగించేవి. పొలాలను ట్రాక్టరులతో దున్నుతున్నాం. పంటలు కోయటానికి మరలు. ఒకటేమిటి! పెద్దపెద్ద నదులకు ప్రాజెక్టులు. మనఇళ్ళని విద్యుత్తులో దేదీప్యమానంగా వెలిగిస్తున్నాం. నిముషాలమీద రైళ్ళలో, కార్లలో సులువుగా పోతున్నాం. టెలిఫోన్ లో హస్తినాపురంనుంచి (ఢిల్లీనుంచి) గురజాలకు కబురులు పంపవచ్చు. నిముషాలమీద వార్తలు ప్రపంచం మూలమూలకు పోతున్నాయ్." వెంకన్నకుఇంకాగుర్తే మొట్టమొదట రేడియోను చూచినప్పటి సంఘటన. రేడియోలు ఎలా మాట్లాడతయ్ అనే ప్రశ్న పుట్టుకు వచ్చింది. లోన మనిషి ఉంటాడా? ఉంటే గాలి? తిండి...ఎన్నో సందేహాలు పుట్టుకు వచ్చినయ్. పట్టణాల్లో ఇళ్లు చూశాడు. ఏదో ఒత్తగానే వెలిగే దీపాలు, బజారులంతా వెలుతురి వెల్లువలు!-ఇవన్నీ తలుచుకుంటే వెంకన్నకు అంతా అయోమయంగా కనిపించింది!

"పరమాణుశక్తి-ఇదే ప్రపంచాన్ని మార్చేస్తుంది. పరమాణుశక్తిని మనుష్యులు ఉపయోగించుకుంటే రోజుకు మనిషి ఒక గంట పని చేస్తే చాలు!"

వెంకన్న 'గంటే' అంటూ కళ్లు పెద్దవి చేశాడు. ఆశ్చర్యానికి అంతులేదు. ఏవేవో ఆలోచనలు కెరటాల్లా విరుచుకు పడ్డయ్. తన జీవితం గుర్తుకు వచ్చింది! గంట పనే! రోజుల్లో ఎంతసేపు వెట్టి చాకిరి? ఆ గంట పనిరోజులు ఎప్పుడు వస్తయ్?

రాంబాబు మళ్ళా సిగరెట్ వెలిగిస్తూ, ఒకసారి అటూ ఇటూ కళ్ళను పోనిచ్చాడు.

అంతలో జనంనుంచి ఒక ప్రశ్న వచ్చింది.

"అయితే అమెరికాలో ఆటంబాంబులు ఉన్నాయికదా, అక్కడ మనుషులు రోజుకు గంటకంటే పని చేయటం లేదా?"

రాంబాబు నవ్వాడు ఒక అయిదు నిముషాలు. నవ్వును ఆపుకోవటం మరో నిముషం. నవ్వునుంచి తేరుకొనే సరికి కొన్ని క్షణాలు పరిగెత్తినయ్.

"అమెరికాలో ఆటంశక్తి ఉపయోగిస్తే అక్కడ కూలి వాళ్ళంతా గంటే పనిచేస్తారు. మిగతా కాలం అంతా విజ్ఞానంకోసం, వినోదం కోసం ఉపయోగిస్తారు."

"అయితే అమెరికాలో ఆపనెందుకు జరగటంలేదు" మళ్ళా ప్రశ్న.

"అదే చెప్పబోతున్నాను. ఈ యంత్రాలు ఉపయోగిస్తుంటేనే అందరికీ పని చూపించలేక పోతున్నారు. ఇక ఆటంశక్తి ఉపయోగిస్తే చాలామందికి పని చూపించలేరు. నిరుద్యోగులెక్కువయిపోతారు. డబ్బు అంతా పెట్టుబడిదారుల దగ్గరికి పోతుంది. అప్పుడు నిరుద్యోగులంతా ఎదురు తిరగటం జరగటం నిజం. అందువలన అమెరికాలో పెట్టుబడి దారులు ఆటంశక్తి ఉపయోగించటం లేదు. అందుకే దానిని రహస్యంగా ఉంచుతున్నారు. మంచికోసం ఉపయోగించకుండా, యుద్ధాల్లో ఉపయోగించాలనే ప్రయత్నాల్లో ఉండి పోయారు."

వెంకన్నకు ఇదేం అర్థం కాలేదు. కళ్ళముందర కారులు, రైళ్లు, పెద్దపెద్ద భవనాలు, వంతెనలు, ట్రాంలు, విద్యుత్ బల్బులు, రేడియోలు కనిపిస్తున్నయ్.

రామయ్యతాత ప్రశ్నించాడు : "ఏయ్ మనవడా, నీవు చెప్పేది బాగానే ఉంది. పని చేస్తే బలం కదా! రోజుకు గంటే పనిచేస్తే ఏం బలం? అంతా నీలాగా, గాలికి ఉఫ్ అంటే ఎగిరి పోయేరకంగా తయారవాలా?"

సిగరెట్ నుసిని విదుల్చుతూ రాంబాబు, "రోజుకు అర్థగంట కసరతు శాస్త్రీయంగా చేస్తే చాలు, మనిషికి కావలసినంత బలం వస్తుంది. అందువలన బలంకోసం మనిషి రోజుకు గంటలకొద్ది బండ చాకిరి చేసే అవసరం పోయింది—" సమాధానం ఇచ్చాడు.

వెంకన్న చుట్టూ చూశాడు. కొండ గుట్టల మీద చీకటి మేఘాలు కమ్ముకున్నయి. పడమటంతా ఎర్రటి కాంతులు ఆకాశాన్ని అలుముకున్నయ్. లేత తమస్సు రెక్కలు విదల్చినట్లు చీకటి పొగ అంతా పొరలి పోయింది. ఊళ్ళో మిద్దెలనుంచి దీపాల కాంతులు నీడలప్రక్క అలుముకున్నాయ్.

వెంకన్న గబుక్కున లేచాడు. రాంబాబు ఏం చెపుతున్నాడో వినలేదు. రామయ్యతాత మీసం మీద చేయి అసలు చూడలేదు. వింతలు వింటున్న జనం అగుపించితేగా!

రివ్వున బజారులో నడిచాడు. అడుగులు గతగతమని వినిపించినయ్. అరోడ్డులు మట్టివి! ప్రక్కకు చూడ మనస్కరించలేదు. మనస్సు వేగంతో కొట్టుకుంది. గుండెల్లో నాలుగు మెయిలు ఇంజనులు, ఓ పది ఎక్స్‌ప్రెస్ ఇంజనులు పరిగెడుతూన్నట్లూ మనస్సే ఒక యుద్ధరంగంలా తయారయింది. హృదయంలో ఆటంబాంబే ప్రేలినట్టు అనిపించింది.

ఇంటి ముందరకు చేరాడు గుడిసె తలుపు నెట్టేస్తూ, ఒక దెబ్బన.

గుడిసెలో ఆముదం వత్తి వెలుగుతూంది. అక్కడే రంగి వత్తులుచేస్తూ కూర్చుంది. వెంకన్న వస్తున్నాడని తెలుసుకుని వత్తులు అక్కడపెట్ట పోయింది. తడిక చప్పుడులో ఉలిక్కి పడ్డది.

"ఏం, తాగి వచ్చావా? జడిపించేశావు-"

వెంకన్న నవ్వాడు పెద్దగా. గుడిసెంతా నవ్వుతో నిండిపోయింది. పొరలి పొంగి చుట్టూ గాలిలోకి దూసుకు పోయినయ్ నవ్వు కెరటాలు.

"ఏమిటా నవ్వు! గుండె గుభేలు మన్నది తడిక నెమ్మదిగా తీయకూడదూ ఎంత తాగినా?"

వెంకన్న నవ్వాడు మరీ పెద్దగా. తలగుడ్డ తీసి విసిరి కొట్టాడు ఓ మూలకు. ఆముదం వత్తి వైపు చూశాడు. మళ్లా నవ్వాడు.

రంగిముఖంలో ఓర్పుపోయింది. ఏం అర్థం కాలేదు. తల తిరిగిపోతోంది. వెంకన్న తాగినా ఇంత నవ్వేవాడుకాడే! ముఖంనిండా జిజ్ఞాస ఉట్టిపడింది.

"నీకు పుణ్యముంటుంది. చంపకు ఏంనవ్వు-"

వెంకన్న ఆపలేదు.

రంగి చెవులు మూసుకోవలసి వచ్చింది. మూసుకున్నా వినిపిస్తూంది. ఒక్కసారి వెంకన్న దగ్గరికిదూకి నోరుమూసింది.

వెంకన్న నవ్వు ఆపి, రంగివంక కళ్లు పెద్దవి చేసి చూస్తుండిపోయాడు.

"ఏమిటా చూపులు? దయ్యంపట్టిందా?"

"ఆ- దయ్యం పట్టిందంటావా? జాగ్రత."

నుక్కిమంచంమీద కూలబడ్డాడు. ఆముదం వత్తి వెలుతురులో నల్లటి శరీరం కండల్లో పట్ట రాని ఆవేశం ఆవేదన మరిగిపోతున్నయ్.

"మరేంటా నవ్వులు-"

"ఏం నవ్వకూడదా?"

"ఎందుకూ నవ్వు? ఏంచూసి."

రంగి మాటవిరిచింది తనకు నవ్వటానికే అర్హతలేనట్టు. రంగి చూపుల్లో తనకీ ప్రపంచంలో ఏంచూసి పొంగటానికీ అర్హత లేదన్న అర్థం ద్యోతకమవుతుంది.

"నీకు తెలియదులే."

వెంకన్న ముఖంలో సీరియస్‌నెస్ వచ్చింద. నల్లటి నొసల్లో వెలుతురు దీర్ఘాలోచనలను ఆన్వేషణ చేస్తూంది.

"ఏమిటా తెలియనది."

"నీ ముఖం. చెప్పతాను విను. వినవే దయ్యం."

కొద్దిగా నవ్వాడు. భయంపుట్టింది. ఎందుకు? ఒకటే కారణం. మళ్ళా ఈ నవ్వు ఆ పెద్ద నవ్వుగా తయారవుతుందని.

రంగి చూరులవంక చూసింది బెదురుతూ. తాటాకుల కొంపంతా వెదికినై చూపులు ఏం అర్థంకాక!

"ఆటంబాంబు - రేడియో - ఎలక్ట్రిసిటీ - ట్రాక్టరు- ప్రాజెక్టు - ట్రాం- మిషిన్-"

పూర్తిచేసి మళ్ళీ నవ్వాడు.

రంగికి ఒళ్లంతా జెర్రులు పాకినట్టు అయింది. అందులో ఒక్కమాట వినలేదంటే వినలేదు. చచ్చినా విని చావలేదు, పుట్టిన తరువాత.

"నీకు గంగానమ్మ పట్టింది ఆచారులు గారిని పిలుస్తాను."

వెంకన్న ఒక్కసారి పడుకున్న వాడల్లా లేచి కూర్చున్నాడు.

"ఓసే ఏమన్నావు?" అన్నాడు కళ్లు పెద్దవిచేసి, పెళ్ళాంవంక చూస్తూ.

"ఏమిటా కలవరింతలు? ఆమాటలు నీ నోట్లోనుంచి వినలేదు."

"ఊఁ-అందుకని."

"ఆచారులగారిని పిలపిస్తాను. విభూతి ఇస్తాడు."

"నోర్మూయ్ ఎవరనుకున్నావు. తన్నేనంటే ఆటంబాంబులా చస్తావు."

"అదుగో నీకు దయ్యం పట్టింది." కళ్లు తుడుచుకుంది, పమిటె కొంగుతో.

"తన్నేనంటే నాలుగుసారులు చస్తావు. నాకు దయ్యం పట్టిందంటావు రేడియోలా వాగుతూ."

రంగి మాట్లాడలేక పోయింది. అంతా భయంగా ఉంది. బయట అంధకారం. భవిష్యత్తు అంతా కళ్ళకు తమస్సు గోడల్లా కనిపించింది.

అంతా నిశ్శబ్దం ఏర్పడింది. రంగి ఆలోచనలోమునిగిపోయింరి. వెంకన్న ఆలోచిస్తూండిపోయాడు. రెండు నిముషాల తరవాత తెప్పరిల్లి రంగి కళ్లు తుడుచుకుంటూ.

"ఇంతసేపు - ఎక్కడికెళ్ళావు? పనికి పోయావా."

"వెళ్లాను."

"ఇంత పొద్దు కూకేదాక ఏంచేశావు."

"పోవే పో. నీకివన్నీ ఎవడు చెప్పతాడు."

రంగి ఓ నిమిషం ఆగి మళ్ళా అడిగింది

"ఇంతసే పెక్కడున్నావో చెప్పవూ?"

వెంకన్న విసుగుతో,

"రచ్చబండ దగ్గర. దొరలేదో మాట్లాడు తుంటే వింటూండిపోయా."

రంగి అన్నానికి లేవమంది. వెంకడు ఎట్లాగో రెండుమెతుకులు నోట్లో వేసుకున్నాడు.

"ఏం—తిండేం తినలేదు—"

వెంకన్న సమాధానం ఇవ్వలేదు.

భోజనం చేయగానే వెంకన్న మంచంమీద వాలాడు.

రంగి అన్నీ సర్ది వచ్చేసరికి వెంకన్న ఈ ప్రపంచంలోలేడు. రంగి కళ్ళ నీళ్లు తుడుచుకుంది. ఆముదందీపం వెలుగుతూంది. ఆ నీడలో

వెంకన్న ముఖంలో అసహనం దేనికోసమో ప్రబలుతూ ఉండిపోయింది.

రంగి లేచేసరికి తెల్లగా తెల్లవారింది. తూర్పునుంచి సూర్యుడు మండిపోతూ వచ్చాడు. కొండ గుట్టలు ఎండలో భగభగ మండిపోతున్నయ్. పెళపెళమని ఎండ కాగిపోతూంది.

రంగి వెంకన్న మంచందగ్గరకు పోయింది. వెంకన్న కళ్లు తెరిచాడు తెరుస్తూనే అడిగాడు.

"మనం ఎక్కడ ఉన్నాం."

రంగి భయంతో సమాధానం ఇచ్చింది.

"పల్నాడులో చెవకర్రు అనే ఊళ్లో, ఊరుబయట పూరిగుడిసెలో_"

"ని...జం..." అన్నాడు వెంకన్న.

"అవును" అంది రంగి.

"ఇది పట్టణం కాదా?"

"కాదు"

"మనం ఉంది—మేడ కాదా?"

"కాదు"

"మన ఇంట్లో రేడియో లేదా?"

"లేదు"

"మన ఇంటికి విద్యుచ్ఛక్తి లేదా?

"ఆముదం వత్తే"

"వాటర్ సప్లయి లేదా"

"లేదు. నాగలేటికి మూడు మైళ్ళు పోయి మురికినీళ్లు తేవాలి?"

"మన ఊళ్లో కారులు, రైళ్లు ట్రాక్టరులు తిరగటంలేదూ?"

రంగి మరి భయపడింది. వెంకన్న చూపుల్లో అగ్ని పర్వతాలు మండుకు పోతున్నాయ్. అవి రుద్రాకారమేమో! మండి పోయిన అగ్నిశిఖలు మింగుతున్నట్టు అనిపించింది.

"ఎందుకు లేవు?"

వెంకన్న లేచి కూర్చున్నాడు ఒళ్లు విరుస్తూ. ఆవలిస్తూనే నిలబడ్డాడు.

"నేను బతికేది - అటంశక్తి ఉపయోగించి మనిషికి గంట పని ఇచ్చే యుగం కాదా"

"పనిలోకి వెళ్ళాలి. ఆలస్యం అయింది. ఆలస్యంగా పోయావంటే ప్రొద్దుగూకే వరకు రావు" అంది రంగి.

పై పంచ తలగుడ్డ చుట్టుతూ కదిలాడు. వాకిట్లోకి పోయి పెద్దగా అరచాడు, రుద్ధ కంఠంతో, కంఠంలో ఆరిపోని బాధతో.

"రాంబాబు అబద్ధంచెప్పాడు"అని. చుట్టూ అంతా వచ్చారు - వెంకన్న స్థితి అర్థంకాలేదు ఎవరికీ. రంగి గుండెల్లో రైళ్లు పరిగెత్తినయ్.

"రైళ్లు, కారులు, విద్యుత్, రేడియోలు, అటంశక్తి, మేడలు మనకి కాదు - ఇవన్నీ ఎవరికి? ఈ లోకం ఎవరికి?"

కాని వెంకన్న హృదయంలో ఆశా తరంగాలు, తెగులుపడ్డ బొమ్మజెముడు పొదల్లా ఎదిగి కూలిపోయినయ్. ఏం అర్థంకాక, తెలుసుకోలేక, చివరికి ఈ ప్రపంచం మాయ అన్నాడని అనుకోవచ్చు.

అమెరికాలో ఒక సంవత్సరం ఉండి వచ్చిన మూర్తిని అక్కడి విశేషాలు చెప్పమని కోరాడు గోపాల్.

"గోపాల్ నువ్వూ తప్పక అమెరికా వెళ్ళాలి. అక్కడ అన్నీ ఉచితంగా లభిస్తాయి. లిమోసిన్ కార్లో తిరగవచ్చు.- డబ్బు ఖర్చులేకుండా. మంచి మంచి హోటళ్ళలో భోజనం చెయ్యొచ్చు- దమ్మిడీ ఇవ్వకుండా. రకరకాల అందమైన బట్టలు లభిస్తాయి- ఉచితంగా. అక్కడ ఉన్నన్నాళ్లూ పెద్దపెద్ద మేడలలో ఉండవచ్చు - అద్దె ఇవ్వకుండానే. చాలా బాగుంటుంది కదూ."

"నిజంగా నీకివన్నీ జరిగాయా" ఆశ్చర్యపోతూ అడిగాడు గోపాల్.

"నాకా? అబ్బే లేదు. కాని మా చెల్లెలికి అక్షరాలా జరిగాయి."